క్లుప్తంగా

గూడెంలో ఆదర్శ వివాహం..



వధూవరులను ఆశీర్వదిస్తున్న బంధువులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంకు చెందిన మోకాళ్ల సీతారాములు(కోయ) పాల్వంచకు చెందిన వికలాంగురాలు ధరావత్ శారదను (లంబాడీ) ప్రేమ వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచారు. ఆదివారం కొత్తగూడెం రైటర్ బస్తీలోని పెద్దమ్మతల్లి ఆలయంలో పెళ్లి వేడుక జరిగింది. టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుంపడనేని సతీష్ కాంగ్రెస్ నాయకుడు నాగ సీతారాములు, బంధువులు, స్నేహితులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

రేపు 'చలో కలెక్టరేట్'



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: ఈనెల 26న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని, వామపక్షాల ఆధ్వర్యంలో జరగనున్న ధర్నాలో ప్రజలు అత్యధికంగా పాల్గొనాలని ఆ సంఘం నాయకులు గుమ్మడి నర్సయ్య, దేవరకొండ శంకర్, ఎస్‌ఏ నబీ, తుపాకుల నాగేశ్వరరావు, మోకాళ్ల రమేష్ తెలిపారు. ఆదివారం ఇల్లెందులో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ... రైతులకు కనీస మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతు రుణమాఫీ అమలులో ఆంక్షలు పెట్టడం తగదన్నారు. సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధరలు చెల్లించాలని కోరారు.

ఘనంగా పడిపూజ



పూజలో పాల్గొన్న కొత్వాల తదితరులు

పాల్వంచ: పట్టణంలోని పాత పాల్వంచ గడియకట్టలోని మైసమ్మతల్లి దేవాలయం ప్రాంగణంలో శనివారం రాత్రి అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. పూజారులు పురాణం రామప్పశాస్త్రి, పవన్ శాస్త్రిల ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి మల్లెల నాగేంద్ర స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప గీతాలు ఆలపించారు. పూజల్లో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, శరత్, రమేష్, కిరణ్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందు: రోడ్ల మీద పడుకునే యాచకులు, పేదలు కప్పుకునేందుకు దుప్పట్లు లేక చలికి వణికిపోతున్నారు. గమనించిన ఆర్యవైశ్య మహాసభ సభ్యులు పట్టణంలోని వార్డుల్లో పర్యటిస్తూ గుర్తించిన పేదలు, యాచకులకు ఆదివారం దుప్పట్లు అందజేశారు. అర్వపల్లి రాధాకృష్ణ, ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, రజనీకాంత్, శ్యామ్, పుల్లూరి సతీశ్‌కుమార్, మధుబాబు, సైపా రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందించండి..



మాట్లాడుతున్న యాకూబ్‌పాషా

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీ గురుకుల విద్యాసంస్థల్లోని విద్యార్థులకు తక్షణమే యూనిఫాం అందించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో మాట్లాడారు. జూన్ 1న కళాశాలలు, జూన్ 12న పాఠశాలలు ప్రారంభమై నెలలు దాటినా, నేటి వరకు విద్యార్థులకు యూనిఫాం అందించలేదన్నారు. ఈ ఏడాది 204 మైనారిటీ గురుకుల పాఠశాలలో 64,140 మంది, 204 మైనారిటీ గురుకుల కళాశాలలలో 18,993 మంది మొత్తం 83,133 మంది విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు. విద్యార్థులలో సమానత్వం, క్రమశిక్షణ పెంపొందించటంలో యూనిఫాం కీలక పాత్ర పోషిస్తుందని, అటువంటి యూనిఫాం అందకపోవటంతో విద్యార్థులలో మనోధైర్యం దెబ్బతినటమే కాకుండా, విభజన కూడా కనిపిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి చర్యలు కోరారు. ఈ సమావేశంలో మైనారిటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హుస్సేన్ ఖాన్, జిల్లా మైనారిటీ నాయకులు ఆసిఫ్, షకీల్ పాల్గొన్నారు.

వాహనం అదుపు తప్పుతోంది..

- కార్యరూపం దాల్చని ఫోర్‌లేన్ రోడ్డు
- అతి వేగం, నిర్లక్ష్యంతో గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- సూచిక బోర్డులు లేకపోవడంతో పలు ప్రమాదాలు



నాయకులగూడెంలో డివైడర్ లేని డబుల్ రోడ్డు

సుజాతనగర్: కొత్తగూడెం, ఖమ్మం రాష్ట్రీయ ప్రధాన రహదారిలోని నాయకులగూడెం గ్రామ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది. రోజురోజుకూ ఇక్కడ రోడ్డు మృత్యుమార్గంగా మారుతోంది. ప్రధాన రహదారికి ఆనుకొని గ్రామం ఉండటం, ఫోర్‌లేన్ రహదారి నిర్మాణంలో జాప్యం కారణంగా తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లు భవనాల శాఖాధికారులు కనీసం సరైన ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు కూడా చేయలేదు. రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయపడి కాళ్లు, చేతులు విరిగి దివ్యాంగులుగా మారుతుండటంతో పాటు, పలువురు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంటోంది.

ఫోర్‌లేన్ రోడ్డు లేక ప్రమాదాలు...

కొత్తగూడెం నియోజకవర్గానికి ముఖద్వారం సుజాతనగర్ మండలంలోని డేగలమడుగు గ్రామం. ఈ ఊరు దాటిన తరువాత సుమారు ఒక కిలోమీటరు మేర ప్రధాన రహదారి పక్కనే నాయకులగూడెం గ్రామం ఉంది. రాష్ట్రీయ రహదారి కావడంతో ఆర్టీసీ బస్సులు, లారీలు, కళాశాలల, పాఠశాలల బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు, ప్రైవేట్ వాహనాలు, ఇతర భారీ వాహనాలు నిత్యం పెద్దఎత్తున రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గానికి సంబంధించి గతంలోనే ఫోర్‌లేన్ రహదారి మంజూరైనా పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత కారణంగా నేటి వరకూ అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం డబుల్ రోడ్డే దిక్కు కావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దినచర్యలో భాగంగా పనుల నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి గ్రామంలోకి వస్తోన్న క్రమంలోనో.. గ్రామం నుంచి రోడ్డెక్కుతున్న సమయంలోనో ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్రవాహనదారులు, పాదచారులు రోడ్డు దాటుతున్న సమయంలో భారీ వాహనాలు ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు..

ఈ ప్రాంతంలో ఇటీవల ప్రమాదాలు అధికమయ్యాయి. అతివేగం, అజాగ్రత్తే ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతూ తప్పని పరిస్థితిలో బిక్కుబిక్కుమంటూ వచ్చిపోతున్నారు. గ్రామ ప్రారంభంలో మూలమలుపు ఉంది. మూలమలుపు వద్ద రేడియం లైట్లు, వైట్ లైన్లు తప్ప ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టడంలో అధికారుల నిర్లక్ష్యం ప్రత్యక్షంగా కనపడుతోంది. నాయకులగూడెం గ్రామం వద్ద రెండు వైపులా గ్రామం అని తెలిసేలా బోర్డులు కానీ, అక్కడక్కడా జీబ్రా లైన్స్ వంటివి ఏర్పాటు చేయలేదు.



నాయకులగూడెం వద్ద మూలమలుపు



మూలమలుపు వద్ద రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు (ఫైల్)

నాయకులగూడెం వద్ద జరిగిన కొన్ని ప్రమాదాలు...

- 2020 డిసెంబర్‌లో సుజాతనగర్‌కు చెందిన రేషన్ డీలర్ రమాదేవి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో మృతి చెందింది.
- 2022లో నాయకులగూడెం గ్రామానికి చెందిన ఆదెమ్మ అనే మహిళ కూడా రోడ్డు దాటుతున్న క్రమంలో ఖమ్మం వైపు నుంచి వస్తోన్న కారు ఢీకొట్టడంతో మృతి చెందింది.
- ఇటీవల జూలూరుపాడు మండలానికి చెందిన లకావత్ నాగేశ్వరరావు దంపతులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా... ఖమ్మం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందగా అతని భార్య పరిస్థితి విషమంగా మారింది.
- గతంలో నాయకులగూడెం వద్ద రోడ్డు పక్కన గల ఓ దుకాణంలోకి లారీ దూసుకెళ్లడంతో నలుగురు మృతి చెందారు.

ఫోర్‌లేన్ రోడ్డు నిర్మించాలి...



గత ప్రభుత్వ హయాంలోనే డేగలమడుగు గ్రామం వరకూ ఫోర్‌లేన్ రోడ్డు మంజూరు అయింది. డివైడర్ లేకపోవడంతో ఈ ప్రాంతంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. దీంతో చాలామంది అంగవైకల్యంగా మారుతున్నారు. అధికారులు స్పందించి డేగలమడుగు గ్రామం వరకూ తక్షణమే ఫోర్‌లేన్ రోడ్డు నిర్మించాలి. పోలీసులు, ఆర్‌అండ్‌బీ, ఆర్టీఏ అధికారులు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి.

– బత్తుల వీరయ్య, నాయకులగూడెం

ప్రమాదాలను నివారించాలి..



నాయకులగూడెం గ్రామం వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అన్ని రకాల వాహనాలతో ఈ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. డబుల్ రోడ్డును నాలుగు లేన్ల రోడ్డుగా మార్చితే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుంది. కనీసం రోడ్డుపై సూచిక బోర్డులు, మూలమలుపు వద్ద బారీకేడ్లను ఏర్పాటు చేయాలి. ప్రైవేట్ వాహనాల వేగంపై సంబంధిత అధికారుల తగిన చర్యలు తీసుకోవాలి.

– మేక వినోద్‌కుమార్, నాయకులగూడెం

నిబంధనలు పాటించాలి..



వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు కుటుంబసభ్యులు తమకోసం ఎదురు చూస్తుంటారన్న విషయాన్ని మర్చిపోవద్దు. ప్రమాదాల్లో పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం రోడ్డున పడుతుంది. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలి. అతివేగం అనర్థాలకు దారి తీస్తుంది. మద్యం తాగి వాహనం నడపకూడదు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు.

– ఎం.రమాదేవి, ఎస్సై, సుజాతనగర్

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ఆదివారం జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో పరీక్ష నిర్వహణకు నాలుగు సెంటర్లు ఏర్పాటు చేయగా, పరీక్షకు మొత్తం 784 మంది విద్యార్థులకు గానూ 756 మంది హాజరు కాగా 28 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్ష నిర్వహణకు సహకరించిన ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.

సింగరేణిలో దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్-1 (కాంట్రాక్ట్) పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఆదివారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 25 నుంచి డిసెంబర్ 4వ తేదీ లోపు ఆన్‌లైన్ చేసుకోవచ్చని ఆ ఉత్తర్వులో పేర్కొంది. ఇతర వివరాలకు కంపెనీ వెబ్‌సైట్ **www.rccminer.com** చూడాలని సూచించింది.

చిన్నారికి రక్తదానం



రక్తదానం చేసిన నజీముద్దీన్

ఇల్లెందు: ఇల్లెందు మండలం ధర్మాపురానికి చెందిన గుంజ వీరన్న కుమార్తె ఎస్సీబా ఐదేళ్ల చిన్నారి తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా రక్తం అత్యవసరం అయింది. ఈ మేరకు ఇల్లెందులోని వినయ్ చాలెంజర్ జిమ్ సభ్యులు ఆదివారం ఆ చిన్నారికి రక్తం దానం చేసి ఆదుకున్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం



విజేతలకు షీల్డ్‌లు అందజేస్తున్న జీఎం

ఇల్లెందు: సింగరేణిలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఉంటుందని ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ఆదివారం ఇల్లెందులోని 24 ఏరియా ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2024–25లో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, అధికారులు శివప్రసాద్, జీవీ మోహన్‌రావు, సాయిస్వరూప్, యూనియన్ ప్రతినిధులు నజీర్ అహ్మద్, జే.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన అధికారులకు సత్కారం..

సీహెచ్‌పీలో పని చేసి పదోన్నతి పొందిన అధికారులు నాగరాజు నాయక్, క్రిష్టఫర్‌లను జీఎం ఘనంగా అభినందించారు. వారి సేవలను క్రమశిక్షణను కొనియాడారు. అంతకు ముందు ఏరియా వర్క్ షాప్ ఉద్యోగులను అభినందించారు. భద్రత అవగాహన కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, పవన్‌కుమార్, వీర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జేకే ఓసీ మేనేజర్‌కు వినతి



పూర్ణచందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ టీయూసీఐ ఆధ్వర్యంలో జేకే ఓసీ మేనేజర్ పులి పూర్ణచందర్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ మాట్లాడుతూ... కాంట్రాక్ట్ కార్మికులు దుర్భరమైన జీవితం అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, గోపీ, షఫీ, ప్రేమ్, చంద్రమోహన్, సుమిత్ర, రామకృష్ణ, రాంబాబు, యాకూబ్, అశోక్, హుస్సేన్, రాజేశ్వరీ, విజయ, రవి, భాగ్యమ్మ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఇల్లెందురూరల్: మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య భౌతికకాయంపై పలు రాజకీయ పక్షాల నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రెండుసార్లు ఇల్లెందు ఎమ్మెల్యేగా ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయిని రాజు, యాకూబ్ షావలీ, ఆవునూరి మధు, తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి, సారయ్య, దేవరకొండ శంకర్, ముద్రగడ వంశీ నివాళులర్పించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచరూరల్: నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తోగ్గూడెం తండాలో రూ.15లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్ర భవనానికి ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ డీఈ రామకృష్ణ, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ముత్యాల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..

సుజాతనగర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సుజాతనగర్ మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి బోనస్ ఇస్తుందని, అది పొందాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, ఎంపీడీఓ భారతి, ఏఓ నర్మద, డీటీ నాగరాజు, వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, సొసైటీ డైరెక్టర్ బండి అమృతరావు, పోటు వెంకటేశ్వరరావు, మానిటరింగ్ ఆఫీసర్ జయశ్రీ, కొండూరు రాజేంద్రప్రసాద్, సంఘం సెక్రటరి పండ్ల సారయ్య, రైతులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే వినతిపత్రం..

సూపర్‌బజార్(కొత్తగూడెం): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరుతూ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కూనంనేని మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో జీవనం గడుపుతున్న జర్నలిస్టులకు నిలువ నీడలేని పరిస్థితులు ఉన్నాయని, వారికి గూడు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిపై ఉందన్నారు.

26న కలెక్టరేట్ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న సారంగపాణి

సింగరేణి(కొత్తగూడెం): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 26న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని అఖిలభారత రైతు, కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కే.సారంగపాణి అన్నారు. ఆదివారం ఏఐకేఎంఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పాలకుల కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాల వల్ల దేశంలోని ప్రజలు, రైతులు, కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. అన్ని పంటలకు మద్దతు ధర ఖర్చుకు 50శాతం అదనంగా అమలు చేయాలని, రుణమాఫీ, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ విధానాన్ని నిషేధించాలని, ఔట్‌సోర్సింగ్, అటవీ హక్కుల చట్టం–2006ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు అమలు చేయాలని, రోజుకు రూ.600 ఇవ్వాలని విన్నవించారు. కౌలు రైతులను గుర్తించి అన్ని పథకాలను వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ దేశంలో 500 జిల్లా కేంద్రాలలో ఎస్‌కేఎం ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తోందని అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గౌని నాగేశ్వరరావు, కుంజ కృష్ణ, ఎట్టి నరసింహారావు, వరకూటి వెంకట్రావ్, నర్సింహారావు, శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



హాజరైన ఆటో కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. స్థానిక శేషగిరిభవన్‌లో ఆదివారం జరిగిన ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా తృతీయ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహాలక్ష్మి పథకాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఈ పథకం ద్వారా ఆటో, క్యాబ్ ఇతర ప్రజా రవాణాపై ఆధారపడి స్వయం ఉపాధి పొందుతున్న కార్మికులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలను పోషించుకోలేక, ఫైనాన్స్ కట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు జరుగుతున్నాయని వాపోయారు. ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరారు. సంక్షేమబోర్డు ఏర్పాటు కోసం రవాణారంగంలో పనిచేస్తున్న కార్మికులు కేంద్రంపై పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఐదు దశాబ్దాలకు పైగా కార్మికులకు ఏఐటీయూసీ ఎనలేనిసేవలు అందించిందన్నారు.

మహాసభలో కంచర్ల జమలయ్య, ఎస్.ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, వి.మల్లికార్జున్, నేరెళ్ల రమేష్, ఆటో యూనియన్ నాయకులు మర్రి కృష్ణ, అనిల్, హమీద్, బడుగు భాస్కర్, అబ్బులు, సత్యనారాయణ, కృష్ణ, పాషా పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

కొత్తగూడెంఅర్బన్: జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో డార్విన్ పరిణామ సిద్ధాంత వాల్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... మానవుని రూపం వివిధ దశల వారీగా రూపాంతరం చెంది నేటి పరిస్థితి ఏర్పడిందని, భూమండలంలోని సకల జీవరాశులు కూడా అలాగేనని డార్విన్ సిద్ధాంతం తెలియజేసిందన్నారు. ఏదో అతీత శక్తి మానవుల ప్రస్తుత రూపంతో జన్మించేలా చేసిందనేది అవాస్తవమన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు డార్విన్ కనుగొన్న జీవ పరిణామ సిద్ధాంతాన్ని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎ.కస్తూరి కె.నాగేశ్వరరావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఉచిత వైద్యశిబిరం



డీఎస్పీ చంద్రభానుకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హర్షవర్ధన్

ఇల్లెందు: రేయంబవళ్లు విధుల్లో నిమగ్నమయ్యే పోలీసులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యాల పట్ల జాగ్రత్త వహించాలని డీఎస్పీ చంద్రభాను కోరారు. ఆదివారం ఇల్లెందు సబ్ డివిజన్ పోలీసులకు పట్టణంలోని ఐతా ఫంక్షన్ హాల్‌లో ప్రజా వైద్యశాల డాక్టర్ల బృందంచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో చేరిన రోజుల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి శారీరక సామర్థ్యంతో ఆరోగ్యంగా శిక్షణ కేంద్రాల నుంచి ప్రజలకు సేవ చేయటానికి రావటం జరుగుతుందన్నారు. విధుల్లో చేరిన తర్వాత నిత్యం శాంతి భద్రతల పరిరక్షణలో విశ్రాంతి లేని జీవితం గడుపుతుంటారని తెలిపారు. చాలా సందర్భాల్లో నిద్రాహారాలు మాని విధులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. ఈ క్రమంలో అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతీ సబ్ డివిజన్ స్థాయిలో ఉచిత పరీక్షలు నిర్వహించి పోలీసుల ఆరోగ్య రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు, టేకులపల్లి, గుండాల సీఐ బత్తుల సత్యనారాయణ, పి.సురేష్, శ్రీనివాస్‌రావు, ఎస్‌ఐలు ఎస్‌ఐలు సూర్య, నాగుల్ మీరా, రతీస్, రాజమౌళి, శ్రీకాంత్, డాక్టర్లు హర్షవర్ధన్, రవితేజ, సాయి చరిష్మా, రాంనివాస్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

కుల సంఘాల ఆధ్వర్యంలో వనసమారాధనలు



కొత్తగూడెంరూరల్: ఎంపీ రవిచంద్ర, వనమాను పూలమాలలతో సన్మానిస్తున్న దృశ్యం

ఆదివారం కార్తీక వనసమారాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్యులు, కమ్మ సంఘం, మున్నూరు కాపు, పద్మశాలీ సంఘాల నాయకులు, ప్రజలు కుటుంబ సభ్యులతో సమీపంలోని మామిడితోటలో జరిగిన వనసమారాధనకు హాజరయ్యారు. సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. – సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు: కోలాటం ఆడుతూ వనసమారాధనకు బయలుదేరిన మహిళలు



పాల్వంచ: హాజరైన కమ్మ సంఘం సభ్యులు



ఇల్లెందురూరల్: వనమహోత్సవానికి హాజరైన పద్మశాలీ కుటుంబాలు



ఇల్లెందు: హాజరైన మున్నూరుకాపు మహిళలు